# నేటి మహిళ

ప్రఫుల్లచంద్ర

సాయంకాలం ఆరు, ఇంకా చీకటి పడలేదు. గాలి వేడి తగ్గలేదు. ఒళ్లంతా చిరుచెమట, అలసట... ఆఫీసునుంచి వచ్చి స్కూటీ లాక్ చేసి ఇంట్లో అడుగుపెట్టిన అన్వితకు వాతావరణం కొత్తగా వేడిగా అనిపించింది. బద్ధకంగా వాలు కుర్చీలో మేను వాల్చి కళ్లు మూసుకుని కాసేపు రిలాక్స్ అయింది.

తను ఆఫీసునుంచి రాగానే ఎదురువచ్చి కబుర్లు చెబుతూ ఆఫీసు విషయాలు అడిగే అమ్మ కిచెన్‌లోంచి ఇంకా బయటకు రాలేదు.అంటే తను స్నానం చేసి రాగానే దాడి లేక హితబోధ తప్పవన్నమాట! చిన్నగా నవ్వుకొని బాత్‌రూంలోకి వెళ్లింది అన్విత. చన్నీటి షవర్ హాయిగా ఉంది. స్నానం ముగించి తేలికపాటి నూలు చీర కట్టుకొని మళ్లీ వాలు కుర్చీలో కూర్చుంది. ఉదయం పతాక శీర్షికలు మాత్రమే చదివి వదిలేసిన పేపర్ తీసి చదువుకుంటూ ఉండగా అమ్మ వచ్చి టీ ఇచ్చింది.

ఇంక సుత్తి ప్రారంభం! అనుకుంది అన్విత టీ తాగుతూ.

"మధ్యాహ్నం అల్లుడుగారొచ్చారే!" అంది అమ్మ నాందిగా.

పేపర్ చూస్తూ, టీ తాగుతూ అనాసక్తంగా ఉండిపోయింది అన్విత.

కుర్చీ తెచ్చుకుని కూతురు ప్రక్కనే కూర్చుంటూ "చాలా మారిపోయాడే! పశ్చాత్తాపపడుతున్నాడు. సయోధ్యకు తహతహలాడుతున్నాడు" భావోద్వేగంతో అంది అమ్మ.

పేపర్‌నుంచి దృష్టి మరల్చకుండా ఖాళీకప్పు అమ్మకిచ్చి "రెండోపెళ్లాం లలితనేం చేస్తాడట?" అడిగింది అన్విత.

"పేరుకే లలితగాని మహా పెంకిఘటం అట. నీ బిడ్డను సరిగా చూడడం లేదట. విడాకులిచ్చేశాడట" సంబరంగా చెప్పింది అన్నపూర్ణమ్మ.

"నాకు విడాకులిచ్చినప్పుడు కూడా పెంకిఘటం, శీలవతికాదు అన్నాడు నన్ను. బిడ్డను నానుంచి వేరు చేశాడు" అన్విత స్వరంలో నిర్వేదం.

"ఇప్పుడవన్నీ ఎందుకే? పశ్చాత్తాపపడుతున్నాడు కదా! మగదిక్కు లేకుండా ఎంతకాలం ఉంటావే? నేను చస్తే నీ గతేమిటి?" అమ్మ స్వరంలో బాధ గింగురుమంది.

నిర్లిప్తంగా ఎదుటి కుర్చీమీదకు కాళ్లు చాచుకుని కళ్లు మూసుకుంది అన్విత. ఎంతకూ మాట్లాడకపోతే చూసి చూసి ఖాళీకప్పుతో కిచెన్‌కి వెళ్లిపోయింది అన్నపూర్ణమ్మ.

సయోధ్య మాట వినగానే అమ్మాయి బుస్సుమనలేదు! నయమే! ఇప్పుడు పడిన బీజం మొలకెత్తి ఎదగడానికి టైమ్ పడుతుంది. తను చనిపోయేలోగా దాని కాపురం చక్కబడితే చాలు. తృప్తిగా అనుకుందామె.

విడిపోయి మూడేళ్లు దాటాక సుమన్ సయోధ్య అంటున్నాడంటే అందుకేదో కారణం ఉండాలి..నిస్త్రాణగా మనసు గతాన్ని తవ్వుకుంటోంది.

* * *

వివాహం అయాక తొలికాన్పు కోసం పుట్టింటికి వెళ్లి ప్రసవించాక బిడ్డతో భర్తవద్దకు వెళ్లే మధ్యకాలం ప్రతిమహిళ జీవితంలోనూ చాలా ముఖ్యమైనది.

కొత్తగా అనుభవంలోకి వచ్చిన బెడ్‌రూం సుఖాలకు ఐదారు నెలలు విరామం ఏర్పడితే చాలామంది మగాళ్లు తల్లడిల్లిపోయి ప్రక్కదారులు పడతారు. అన్విత విషయంలోనూ అదే జరిగింది.

సుమన్ పనిచేసే ఆఫీసులోనే సుమతి పని చేస్తోంది. ఉద్యోగరీత్యా ఆమె భర్త దేశంమీద తిరుగుతూ ఆదివారాలే ఇంటిలో ఉంటాడు. కాలం కలిసి రావడంతో సుమతి సుమన్‌లు చేరువ అయ్యారు.

తప్పు చేసినవాడు, ఎవరూ తనని ప్రశ్నించకుండా ఉండేందుకు ముందుగానే ఎదురుదాడి ప్రారంభిస్తాడు.

తనతో మాట్లాడే సాహసం ఎవరూ చేయకుండా ఎగిరెగిరిపడుతూ ఉంటాడు. సుమన్ కూడా ఆ ట్రిక్కే ఉపయోగించాడు.

భార్యమీద చీటికీ మాటికీ చిర్రుబుర్రులాడడం, ఏం అడిగినా బుస్సుమనడం, పైగా ఆమె కూడా తనలాగే అక్రమ సంబంధానికి పాల్పడిందేమోనని అనుమానంతో వేధించడం, కొట్టడం, తిట్టడం ప్రారంభించాడు. అన్విత తన నిర్దోషిత్వం నిరూపించుకోడానికి ప్రయత్నిస్తున్నకొద్దీ సుమన్ మరింత విజృంభించి నరకమే చూపించాడు.

ఇంకేమాత్రమూ భరించలేని అన్విత గృహహింస కేసుపెట్టి విడాకులకు అర్జీ పెట్టుకుంది.

అయితే చట్టాల్లోని లోపాలు ఉపయోగించుకోవడం కొందరికి వెన్నతో పెట్టిన విద్య. డబ్బు, న్యాయవాది జట్టుకడితే న్యాయం మసిపూసుకుని మూల కూర్చోవలసిందే. అన్యాయం ఆకర్షణీయ మేకప్ వేసుకొని చెలరేగిపోతుంది.

అన్విత పెంకిఘటం! వ్యభిచారిణి! అని నిండు కోర్టులో మసిపూశారు. ఆమెవద్ద పెరిగితే బిడ్డ భవిష్యత్తు నాశనం అవుతుందని ఘోషించాడు.

చెవులు తప్ప కళ్లులేని కోర్టు గృహహింస కేసు కొట్టేసి, విడాకులు మంజూరు చేసి తల్లీ, బిడ్డను వేరు చేసింది.

భర్తమీద, న్యాయ వ్యవస్థమీద తీవ్రమైన దుగ్ధతో గుండె పచ్చిపుండుకాగా నెలరోజులు ఎవరికీ ముఖం చూపించలేకపోయింది-అన్విత. తర్వాత గుండె దిటవు చేసుకొని భవిష్యత్తు గురించి ఆలోచించింది.

పెళ్లినాటికే ఆమె యంబీఏ పాసైంది.

ఇప్పుడామె పుస్తకాలు దుమ్ము దులిపి సబ్జెక్ట్ రిఫ్రెష్ చేసుకుని ఇంటర్వ్యూలకు వెళుతూ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు సంస్థలో పాతికవేల జీతం మీద ఉద్యోగం సంపాదించింది.

హైదరాబాద్‌కి మకాం మారినా ఫ్రెండ్స్ ద్వారా సుమన్ విషయాలు ఆమెకు తెలుస్తూనే ఉన్నాయి.

అతడు. లలితను పెళ్లి చేసుకున్నాడట. అయినా అతని సెకండ్ ఇన్నింగ్స్ బాగు పడలేదు.

అతడు బంతిని ఫుల్‌టాస్ వేస్తే ఆమె బౌన్సర్ వేస్తోంది! అతడు ఫోర్ బాదితే ఆమె సిక్సర్! అతడు నోరు పారేసుకుంటే ఆమె చెయ్యి విసురుతోంది.

* * *

అన్విత ఉద్యోగంలో చేరి మూడేళ్లయింది. జీతం పదిహేను వేలు పెరిగింది.



జీవితం హాయిగా సాగుతోంది. భర్తని, బిడ్డని పూర్తిగా మరిచిపోతున్న తరుణంలో సయోధ్య ప్రతిపాదనతో షాక్ ఇచ్చాడు సుమన్.

విడిపోయిన కొత్తలో బంధువులు అన్వితనే నిందించారు. తనేదో సరదాగా కాపురం విచ్ఛిన్నం చేసుకున్నట్లు! బిడ్డని విడిచి వచ్చేసిన కసాయి గుండె అని తిట్టి పోశారు. లోకం పోకడ ఇంతే అని పట్టించుకోలేదు తను. మంచి ఉద్యోగం, మంచి హోదాలో ఉండడంతో విమర్శల జడివాన ఆగిపోయింది. మళ్లీ ఇప్పుడు ప్రారంభం...

మొగుడు పశ్చాత్తాపంతో రమ్మంటే దీనికిదేం మాయరోగం? వెళ్లనంటోందట! బిడ్డకోసమైనా రాజీపడవచ్చుకదా. ఉద్యోగం వెలగబెడుతున్నందుకు గర్వం! అని బంధువులూ, దీనికి పొగరు అని మిత్రులూ...

అమ్మ సరేసరి, భర్త వద్దకు పొమ్మని రెండువారాలుగా వేధింపు...

ప్రతి మనిషికీ రెండు ముఖాలుంటాయి. బయట నలుగురు మధ్య చిరునవ్వులు చిందిస్తూ తియ్యగా మాట్లాడుతూ మంచితనం మాస్క్ వేసుకునే ముఖం ఒకటైతే ఇంట్లో భార్య ఎదుట ప్రదర్శించే చండాలపు ముఖం ఒకటి! బయట అందరూ అతగాడు మంచివాడే అనుకుంటారు. లోగుట్టు భార్యకే తెలుస్తుంది. అల్లుడు పండుగలకు ఇంటికొచ్చినప్పుడు ఆ నవ్వులు, జోకులూ, మెత్తని మాటలూ చూసి అతడు మంచివాడే అనీ, ఒకవేళ పొరపాట్లు చేసినా ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నాడనీ సర్టిఫికేట్లు ఇచ్చేస్తున్నది అమ్మ. అసలు విషయం తెలిసేది అతనితో కాపురం చేసిన భార్యకే కదా!

"పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతోగాని పోవు. అతడు మారడం కల్ల" అంటుంది అన్విత.

"బోయవాడు వాల్మీకిగా మారాడు. గౌతముడు బుద్ధునిగా మారాడు. కళింగయుద్ధం తర్వాత అశోకుడు మారాడు. మార్పు మానవ సహజం. అల్లుడు మనింటికొచ్చి ప్రాధేయపడుతున్నాడు. మారానని మొత్తుకుంటున్నాడు. నువ్వు మొండికెత్తడం సబబు కాదు" అని అమ్మ వాదన.

"కథలు నేనూ చెప్పగలనమ్మా! దుర్యోధనుడు మారలేదు, రావణుడు, నరకాసురుడూ మారలేదు. మంచివాడని నమ్మి నన్ను సుమన్‌కి కట్టబెట్టావు.. ఎంత నికృష్టుడో పెళ్లాయ్యాక తెలిసింది. మళ్లీ అదే తప్పు చెయ్యకమ్మా! విడిపోయాక హాయిగానే ఉన్నాను. అతని జీతం ఇరవైవేలే. కొత్తగా తాగుడు మొదలుపెట్టాడు. జీతం సరిపోక భర్త హోదాలో నా జీతం లాక్కోడానికి ఈ ఎత్తుగడ" అని అన్విత వాదన.

తన మాట వినని కూతురు మీద కోపం వచ్చింది అమ్మకు. దుఃఖం ముంచుకొచ్చింది. తను చనిపోయేలోగా కూతురు కాపురం కుదుటపడాలని ఆమె తాపత్రయం.

"నువ్వే నా మాట వినకపోతే నేను జీవించి ఏం లాభం! ఏ మందో మాకో మింగి చచ్చిపోతా" ఆఖరి అస్త్రం ప్రయోగించింది అమ్మ.

"నేను కాపురానికెళ్లి అక్కడ ఆత్మహత్య చేసుకున్నాక నువ్విక్కడ మందూమాకు మింగుదువుగాని ఆగమ్మా!" గిరుక్కున బెడ్‌రూంలోకి వెళ్లిపోయింది.

అవాక్కయిన అన్నపూర్ణమ్మ అప్పటికి ఊరుకొని రాత్రి పడుకునేటప్పుడు మంచి మాటలతో సౌమ్యంగా మళ్లీ హితబోధ మొదలుపెట్టింది.

విసిగిపోయిన అన్విత "శని ఆదివారాలు నాకు సెలవే. రెండు రోజులుండేటట్టు ఆయన్ని రమ్మను" అనేసింది. అమ్మ పొంగిపోయింది.

★ ★ ★

శుక్రవారం సాయంకాలం కాస్త పెందరాళే ఆఫీసునుంచి వచ్చిన అన్విత ఇంట్లో అడుగుపెట్టగానే హాలులో అమ్మతో మాట్లాడుతూ తనకోసం నిరీక్షిస్తున్న సుమన్ లేచి నిలబడి అభివాదం చేశాడు. ఆ కుర్చీ పక్కనే సూట్‌కేసు. రెండు రోజులుండడానికి సిద్ధంగా వచ్చాడన్నమాట.

అతని ఎదుటి కుర్చీలో కాసేపు కూర్చుని చేతిలోని కవరు టేబుల్‌మీదుంచి ఫ్రెషప్ అవడానికి లోనికి వెళ్లిపోయింది అన్విత. కూతురు తిక్కతిక్కగా మాట్లాడనందుకు సంతృప్తిగా కిచెన్‌లోకి వెళ్లింది అన్నపూర్ణమ్మ టీ చేయడానికి.

పావుగంటలో స్నానం చేసి నూలుచీర కట్టుకొని అన్విత వచ్చేసరికి టీ తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది అమ్మ.

కాసేపు బాబు సంగతులు మాట్లాడి-


"కాన్పుకోసం నేను పుట్టింట ఉన్న ఐదునెలల గ్యాప్‌లో మీరు మారిపోయారు. అందుకని ఈసారి గ్యాప్ రాకుండా మీ ఇంటపడి ఉండి మీ సేవ చేసుకుంటూ బాబుని చూసుకుంటూ ఉండిపోవాలని నిర్ణయించుకున్నాను. దురదృష్టవశాత్తు మనిద్దరివీ బదిలీలేని ఉద్యోగాలు. అందుకని



## ఆరోగ్య రహస్యం

ఇటీవల భోపాల్‌లో వరల్డ్ లాఫర్స్ డే జరిగింది. తన ఆరోగ్య రహస్యాన్ని చెప్పడానికా అన్నట్లు అందరితో కలసి వగలబడి నవ్వుతోంది 103 సంవత్సరాల కస్తూరి సింఘ్వి.

-తటవర్తి



ఉద్యోగానికి రిజైన్ చేశాను. మీకు, లలితకూ విడాకులు మంజూరైన కాగితం మీ వద్ద ఉందికదా. దాన్ని చూపించి మళ్లీ రిజిస్టర్ పెళ్లి చేసుకుందాం'' మృదువుగా అంది అన్విత. ఆమె రిజైన్ చేసినట్టు తెలియని తల్లి నిర్ఘాంత పోగా కవరులోంచి కాగితం తీసి అమ్మకిచ్చింది అన్విత.

రాజీనామా ఆమోదిస్తూ అన్వితను బాధ్యతలనుంచి తొలగించిన ఆర్డర్ అది. ఆ కాగితాన్ని అల్లుడికివ్వబోయింది అన్నపూర్ణమ్మ. "మనం లోపల ఉన్నప్పుడు ఆయన దాన్ని తీసి చదివారులే'' నవ్వేసింది అన్విత.

హఠాత్తుగా కుర్చీలోంచి లేచి సెల్‌ఫోన్ తీసి కొంచెం దూరంగా వెళ్లి ఏదో విని ఏదో మాట్లాడి వెనక్కి వచ్చి "సారీ ఆంటీ! మా ఆఫీసుకు ఆడిటర్లు వస్తున్నారట! నేను వెళ్లాలి. మళ్లీ ఆదివారం వస్తాను'' అంటూ సూట్‌కేసు అందుకొని వెళ్లిపోయాడు సుమన్!

పక పక నవ్వుతూ "నేను చెబితే నమ్మలేదు. మాజీ అల్లుడు మారిపోయాడని తెగ మురిసిపోయావు! రాజీనామా సంగతి వినగానే పారిపోయాడు చూశావా!'' అంది అన్విత.

"ఆదివారం వస్తానన్నాడు కదా!'' ఆశ చావని అమ్మ అంది.

"ఆదివారమే కాదు మరెన్నటికీ రాడు! ఆయన సంగతి నీకన్నా బాగా నాకే తెలుసమ్మా! అసలు ఫోన్ రానేలేదు. అలా నటించాడు. అంతే! లలితది రాజకీయ కుటుంబం. ఈయన విడాకులంటే వాళ్లు ఆస్తిలో భాగం, భరణం ఇమ్మని నానా రభసా చేశారు. విడాకుల పత్రం లేనే లేదు. మాయమాటలు చెప్పి అక్కడ లలితతోనూ ఇక్కడ నాతోనూ రెండిళ్ల కాపురం వెలగపెట్టి భర్తహోదాలో నా జీతం స్వాహా చేద్దామనుకున్నాడు, మాయగాడు!''

అన్నపూర్ణమ్మకింకా నమ్మకం కుదరలేదు. అల్లుడు మంచివాడే, కూతురే మాయమాటలు చెబుతోందని ఆమెకింకా అనుమానమే.

అమ్మని హృదయానికి హత్తుకొని "అమ్మా! నువ్వు సత్యకాలం మనిషివి. ఇలాంటి ట్రిక్కులు ఊహించలేవు. తెల్లనివన్నీ పాలు కాదంటే నమ్మలేవు. నా ఫ్రెండ్స్ ద్వారా సెల్‌నెంబర్ తెలుసుకొని నేను నేరుగా లలితతో మాట్లాడాను. అప్పుడే నీ మాజీఅల్లుడి బండారం బయటపడింది. ఆస్తికి వారసుడిగా బాబు అక్కడ ఉండడం లలితకిష్టం లేదు. ఆస్తిలో భాగం అక్కరలేదని మనం స్టాంప్ పేపర్‌మీద రాసిస్తే బాబుని మనకిచ్చేస్తానంది. అందువల్ల మంచిరోజు చూసుకొని అక్కడికెళ్లు. నీ మాజీ అల్లుడి మంచితనం కళ్లారా చూసినట్టూ ఉంటుంది, బాబుని తెచ్చుకున్నట్టూ ఉంటుంది. రేపే స్టాంప్ పేపర్ సిద్ధం చేస్తాను'' అంది అన్విత.

అన్నపూర్ణమ్మకు దిగ్భ్రాంతిగా ఉంది. ఆమె మానసిక స్థితి అర్థం చేసుకున్న అన్విత సెల్ తీసి లలితను పిలిచి మాట్లాడమని సెల్ అమ్మకిచ్చింది.

అటు లలిత గలగలా కబుర్లు చెప్పి "బాబుని తీసుకెళ్లడానికి అక్కనే రమ్మనాలనుకున్నాను. కాని ఆమె వస్తే పాత జ్ఞాపకాలు వేధిస్తాయి. అందుకని మీరే వచ్చి బాబుని తీసుకెళ్లండి పిన్నిగారూ!'' అంది.

సెల్ ఆపేసి గంభీరంగా ఉండిపోయిన అమ్మను చూసి "ఇంకా నీ సంశయం తీరలేదా అమ్మా! సంసారం రెండెడ్ల బండి పయనం అని, మగతోడు లేనిదే ఆడది బ్రతకలేదని నమ్మే తరం నీది. నేను నేటి మహిళను! మగాడు లేకుండా బ్రతకగలను. అవసరం అనుకుంటే అర్థం చేసుకునే సహృదయుడ్ని వివాహం చేసుకోడానికి వెనకాడను. అసలు సంసారాన్ని రెండెద్దుల బండితో పోల్చడం ఎందుకమ్మా? ఈ రోజుల్లో ఆ బళ్లు ఎవరు వాడుతున్నారు? సంసారాన్ని కారు ప్రయాణంతో పోల్చవచ్చు కదా! కారుకుండేది ఒక్క డ్రైవరే కదా! నా బ్రతుకు నన్ను బ్రతకనివ్వు అమ్మా! మాజీ అల్లుడిని మనసులోంచి చెరిపెయ్'' స్థిరంగా అంది అన్విత.

అప్పటికి సమాధాన పడిన అన్నపూర్ణమ్మ బంగారంలాంటి ఉద్యోగానికి కూతురు రాజీనామా చేసినందుకు బాధ పడింది.

పకపకా నవ్వేస్తూ "సుమన్ నైజం బైటపెట్టడానికి సృష్టించిన ఉత్తుత్తి ఆర్డర్ అమ్మా ఇది! నేను రాజీనామా చేయలేదు. రెండిళ్ల కాపురం వెలగబెడదామనుకున్నాడు. ఉద్యోగం మానేసి కాపురం వచ్చేస్తాననగానే అక్కడ లలిత చేసే రుద్రతాండవం ఊహించుకుని పారిపోయాడు'' అంటూ ఆ కాగితం చింపేసింది.

అమ్మ ఆలోచనలో పడింది. సుమన్ మంచివాడని నమ్మి పెళ్లి చేసి ఒకసారి కూతురు గొంతు కోసిన తను మారిపోయానంటూ అతగాడొస్తే రెండోసారి కూతురు గొంతు కొయ్యబోయింది. కాని అన్విత నేటి మహిళ! తెలివైనది. సమర్థురాలు!

'నేటి మహిళకు మనం ఏమీ చెప్పనక్కరలేదు' సంతృప్తిగా సగర్వంగా అనుకుంది అన్నపూర్ణమ్మ.

★



## కరీనా కబుర్లు

కరీనాకపూర్-సైఫ్ అలీ ఖాన్‌ల ప్రేమాయణంతోనే ఎక్కువగా పాపులర్ అయిన సినిమా 'తషన్' రిలీజయ్యాక తుస్సుమంది. ఈ సినిమా షూటింగ్ ద్వారా తొలిసారిగా కలుసుకున్న సైఫ్-కరీనా తొలి చూపులోనే ప్రేమలో పడ్డారు. కానీ జనాల్లో ఏదో అపనమ్మకం. ఇప్పుడీ 'తషన్' ఫ్లాప్ తర్వాత కూడా వీళ్ల ప్రేమాయణం కంటిన్యూ అయి పెళ్లి చేసుకుంటారా అనేదే పెద్ద డౌటు. అయితే తషన్ విడుదలకు ముందు తాము తొందర్లోనే పెళ్లిచేసుకుంటాము, అలాగే పెళ్లి తర్వాత సినిమాల్లో కంటిన్యూ అవుతాను అంటూన్న కరీనా స్టేట్‌మెంటు ఎంతవరకూ నిజమో తేలాల్సివుంది.

